సాక్షి జగిత్యాల

బుధవారం ၊ 31 ၊ మే ၊ 2023



కొండపై భక్తుల రద్దీ

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.



పోస్టర్ విడుదల

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ యాస్మిన్ బాషా ఆవిష్కరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగలు ఉక్కపోతగా, ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజాసేవతోనే గుర్తింపు



పార్వతికి జ్ఞాపిక అందిస్తున్న వైద్యాధికారులు

కథలాపూర్(వేములవాడ): ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎన్‌గా పనిచేసిన పార్వతి సీహెచ్‌వోగా పదోన్నతి పొందారు. ఈమేరకు మంగళవారం పీహెచ్‌సీలో ఆమెను సన్మానించారు. పార్వతి అందించిన సేవలను అధికారులు ప్రశంసించారు. వైద్యశాఖ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్, డీపీహెచ్‌ఎన్ శోభ, వైద్యాధికారులు సింధూజ, రచన, రజిత, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, భూషణ్, ధనుంజయ్, రాజన్న, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

బాధితులకు తాత్కాలిక వసతి

సారంగాపూర్(జగిత్యాల): అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన గిరిజన కుటుంబాలు తాత్కాలిక వసతి కోసం షెడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభయం ఇచ్చారు. బీర్‌పూర్ మండలం ఆసునూరిగూడెంలో సోమవారం అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన గిరిజన కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందించారు. ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొలుముల దామోదర్ యాదవ్ మరో రూ.10వేలు సాయం చేశారు. బాధిత కుటుంబాలకు వసతి కల్పనకు రూ.2 లక్షల వరకు వెచ్చించి షెడ్లు నిర్మిస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ముందుకు రావాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వచ్చే వానాకాలం ధాన్యం క్వింటాలుకు రూ.2,500 ధర చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పారు. నాయకులు మసర్తి రమేశ్, పాల్సాని నవీన్‌రావు, గుడిసె జితేందర్‌యాదవ్, చెర్పూరి సుభాష్, కోండ్ర రాంచంద్రారెడ్డి, రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి, వెయ్యి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఎంపిక



బండి శివాని




కామని గంగోత్రి

రాయికల్(జగిత్యాల): హైదరాబాద్ మేధా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి చదివిన విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన మేథ సంపూర్ణ శిక్ష స్కాలర్‌షిప్ పరీక్షల్లో భూపతిపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు బండి శివాని, కామని గంగోత్రి ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం లక్ష్మయ్య మంగళవారం తెలిపారు. వీరికి ఇంటర్మీడియెట్ నుంచి ఆరేళ్లపాటు ఉచిత విద్య అందించడం, హాస్టల్ వసతి కల్పించడం, ఇతర అయ్యే ఖర్చులను సంస్థ భరిస్తుందని పేర్కొన్నారు. సర్పంచ్ చంద్రశేఖర్, ఎస్‌ఎంసీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు దాసరి రామస్వామి, సిరిపురం మహేశ్, కార్తీక్, తిరుమల, గంగరాజం, గంగాధర్, శంకరయ్య విద్యార్థులను అభినందించారు.

మృతదేహంపై ఉంగరం మాయం

మెట్‌పల్లి(కోరుట్ల): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని ఓ శవంపై బంగారు ఉంగరం మాయమైన సంఘటన చర్చనీయాంశమైంది. స్థానిక కళానగర్‌కు చెందిన ఎలిగేటి రమేశ్(65)కు ఈనెల 26న గుండెలో నొప్పివచ్చింది. కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తుండగా కుడిచేతి వేలికి ఉన్న 11గ్రాముల బంగారు ఉంగరం కనిపించలేదు. ఈవిషయంపై వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. వారు స్పందించకపోవడంతో డయల్ 100 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాస్టర్‌ప్లాన్ జీవో రద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: బల్దియా మాస్టర్‌ప్లాన్ జీవో నంబరు 238ను రద్దు చేశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాల ప్రకారమే కొత్త మాస్టర్‌ప్లాన్ ఉంటుందన్నారు. పాత మాస్టర్‌ప్లాన్ తప్పుల తడకగా ఉందని తెలిపారు. దీంతోనే 14 జోన్లు, 121 సర్వే నంబర్లను మార్పు చేశారని, తద్వారా ఇళ్ల నిర్మాణ అనుమతులు లభిస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ మహేశ్, హెచ్‌సీఏ సభ్యుడు సురేశ్, సర్పంచులు గంగాధర్, లక్ష్మణ్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఈనెల 29

- బీర్‌పూర్ మండలం అసునూరిగూడెంలో విద్యుదాఘాతంతో రెండు గుడిసెలు కాలిబూడిదయ్యాయి. ఏదుల లక్ష్మి ఇంట్లో నాలుగు తులాల బంగారం, కొంత వెండి, పత్తి, దుస్తులు, నగదు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.5.77లక్షల ఆస్తి నష్టం జరిగింది. పెరుమండ్ల శిరీష ఇంట్లో 15 తులాల వెండి, 2 తులాల బంగారం, 40 క్వింటాళ్ల పత్తి, వస్తుసామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.2.54 లక్షల నష్టం వాటిల్లింది.

ఈనెల 24

- మెట్‌పల్లి మండలం ఆరెపల్లి నుంచి గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు ఓ రైతు లారీలో పశుగ్రాసం తరలిస్తున్నాడు. గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి.

ఈనెల 17

- బుగ్గారం మండలం వెల్గొండలో విద్యుదాఘాతంతో పెసరి అశోక్, పెసరి పాండు ఇళ్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.

ఈనెల 17

- కోరుట్ల మండలం వెంకటాపూర్ శివారులో జగిత్యాల–నిజామాబాద్ జాతీయ రహదారిపై జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన సూర బక్కయ్య కారు నిప్పంటుకుని కాలిపోయింది. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

ఈనెల 21

- బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో కొండ గంగాధర్‌కు చెందిన పశుగ్రాసానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లింది.

ఆస్తులు అగ్గిపాలు



బీర్‌పూర్ మండలం ఆసునూరిగూడెంలో దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- జిల్లాలో తరచూ అగ్నిప్రమాదాలు
- మూడే ఫైరింజిన్ సెంటర్లు
- మారుమూల ప్రాంతాలకు చేరుకోవడం కష్టం
- కాలిబూడిదవుతున్న ఆస్తులు, వాహనాలు
- అయినా, అప్రమత్తంగా ఉంటున్న అగ్నిమాపక ఉద్యోగులు

జగిత్యాలక్రైం: జిల్లాలో అగ్నిప్రమాదాల నియంత్రణ, ఆస్తులు కాపాడటం కష్టతరంగా మారింది. 2022 ఏప్రిల్ నుంచి 2023లో ఇప్పటివరకు 491 అగ్నిప్రమాదాలు సంభవించాయి. అందులో రూ.1,01,52,000 ఆస్తినష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి రూ.6,42,25,500 విలువైన ఆస్తులు కాపడగలిగారు. నలుగురి ప్రాణాలు రక్షించారు.

మూడు అగ్నిమాపక కేంద్రాలు

- జిల్లాలో గతంలో నాలుగు అగ్నిమాపక కేంద్రాలు ఉండేవి.
- ప్రస్తుతం మూడే కొనసాగుతున్నాయి.
- జిల్లా కేంద్రంతోపాటు మెట్‌పల్లి, ధర్మపురిలో అగ్నిమాపక కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు.
- ఇక్కడ మూడు ఫైరింజన్లతోపాటు, జగిత్యాల, మెట్‌పల్లిలో ఒక్కో బుల్లెట్ వాహనం ద్వారా ఘటన స్థలాలకు చేరుకుంటున్నారు.

దూర ప్రాంతాలు.. చేరుకోవడం కష్టం

జిల్లా కేంద్రంతోపాటు మెట్‌పల్లి, ధర్మపురి ప్రాంతాల్లోనే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. దూర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఇక్కడి సిబ్బంది చేరుకునేందుకు గంటకు పైగా సమయం పడుతోంది. అప్పటికే ఆస్తులన్నీ బుగ్గిపాలవుతున్నాయి. రాయికల్ అగ్నిమాపక కేంద్రాన్ని కొనసాగించాలని ఆ ప్రాంత ప్రజలు అనేకసార్లు ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ కవిత, ఎంపీ అర్వింద్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

నలుగురు ప్రాణాలు కాపాడిన సిబ్బంది

అగ్నిప్రమాదాలతోపాటు, నీటి మునిగిన ఐదుగురు వ్యక్తులను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. అగ్నిప్రమాదాలు, నీటి ప్రమాదాలు సంభవించినప్పుడు కూడా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలాలకు చేరుకుని ప్రాణాలు కాపాడుతున్నారు.

సకాలంలో నివారిస్తున్నాం

జిల్లాలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మా శాఖకు సకాలంలో సమాచారం అందిస్తే వెంటనే సంఘటన స్థలానికి చుకుంటున్నాం. ప్రజల ప్రాణాలు కాపాడుతున్నాం. ఆస్తులను రక్షిస్తున్నాం. అగ్నిప్రమాదాల స్థలాలకు అందుబాటులో ఉన్న ఫైరింజిన్, సిబ్బందిని పంపిస్తున్నాం.

– కొమురయ్య, అగ్నిమాపక అధికారి, జగిత్యాల



కాలిపోతున్న పశుగ్రాసం లారీ(ఫైల్)

లక్ష్యసాధనకు శ్రమ ఒక్కటే మార్గం

కోరుట్ల: 'లక్ష్య సాధనకు శ్రమ ఒక్కటే ప్రధాన ఆయుధం.. అలాగని నిరంతరం శ్రమించాల్సిన పనిలేదు.. రోజూ ఎనిమిది నుంచి పది గంటలు సరిపోతుంది.. సబ్జెక్టుపై అవగాహన.. బేసిక్ నాలెడ్జి కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు.. జనరల్ స్టడీస్ కీలకం.. కరెంట్ అఫెయిర్స్‌లో అప్‌డేట్‌గా ఉండటానికి రెగ్యులర్‌గా దినపత్రికలు చదవడం నాకు ఎంతో ఉపయోగపడింది' అని సివిల్స్ 132 ర్యాంకర్ ఏనుగు శివమారుతిరెడ్డి చెప్పారు. ఫలితాల ప్రకటన తర్వాత తొలిసారి అయిలాపూర్ స్వగ్రామానికి శివమారుతిరెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



- ప్రణాళిక బద్ధంగా చదవాలి
- సమాజంలో మార్పు కోసం శ్రమించా
- రోజూ ఎనిమిది గంటలు చాలు
- అమ్మా, నాన్న, బాబాయి స్ఫూర్తి
- ఇంటర్వ్యూలో నక్సలిజంపై ప్రశ్నలు
- సివిల్స్ 132 ర్యాంకర్ శివమారుతిరెడ్డి



తల్లిదండ్రులతో శివమారుతిరెడ్డి

అమ్మానాన్న.. బాబాయి స్ఫూర్తి..

మాది వ్యవసాయ కుటుంబం.. అయినా, నాన్న అంజిరెడ్డి చక్కగా చదువుకుని టీచర్ ఉద్యోగం సాధించారు. అమ్మ పుష్పలత వ్యవసాయ పనులు చూసుకుంటారు. నాన్న చాలా మంది విద్యార్థుల భవిష్యత్‌కు మార్గనిర్దేశం చేశారు. ఉన్నతస్థానంలో ఉంటే అంతకన్నా చాలామందికి మేలు చేయవచ్చనే నా తపన, మా అమ్మానాన్నల ప్రోత్సాహం, చనిపోయిన మా బాబాయి సంజీవరెడ్డి స్ఫూర్తి తోడుగా నిలిచాయి.

శ్రమను మించిన ఆయుధం లేదు..

సివిల్స్ సాధనలో శ్రమను మించిన ఆయుధం లేదు. చిన్ననాటి నుంచి మా నాన్న ఏటా శ్రమించి లక్ష్యాలు ఎలా సాధించాలో అలవాటు చేశారు. ప్రతీ సంవత్సరం చదువులో ముందంజలో ఉండటాన్ని గుర్తించి తన స్తోమతకు మించి ఖర్చు చేసి మంచి చదువు చెప్పించారు. సివిల్స్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఢిల్లీ సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో బీఏ(ఎకనామిక్స్)లో చేర్చారు. నాలుగైదేళ్లుగా శ్రమిస్తున్నా. 2021లో ఓసారి సివిల్స్ రాశా. కరోనా సమయం కావడంతో అనారోగ్యంతో ప్రిలిమినరీ గట్టెక్కలేకపోయా. రెండోసారి 132 ర్యాంకు సాధించా.

సబ్జెక్టులపై పట్టు కీలకం..

ఇంటర్ వరకు ఎంపీసీ, ఆ తర్వాత బీఏ చదవడం అన్నివిధాలా కలిసొచ్చింది. ఓ వైపు మ్యాథ్స్, సైన్స్‌పై పట్టు, మరోవైపు పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో ప్రావీణ్యం ర్యాంకు సాధనకు తోడ్పడింది. ప్రతీ సబ్జెక్టును చిన్న భాగాలుగా చేసుకుని వాటిపై పట్టు వచ్చాకే ఇతర అంశాలు చదివా. రోజూ ఎనిమిది గంటలు మనసు పెట్టి చదివా. సబ్జెక్టులపై అవగాహన కోసం ఆన్‌లైన్‌లో లభించే సమాచారం పనికివచ్చింది. దీనికితోడు మా కళాశాల నుంచి సివిల్స్ సాధించిన సీనియర్స్ సలహాలు ఎంతగానో ఉపకరించాయి. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ మా కళాశాలలోనే చదివారు. ఆయన స్ఫూర్తితోనే పొలిటికల్ సైన్స్‌తోపాటు ఇంటర్నేషనల్ రిలేషన్స్ సబ్జెక్టును ఆప్షనల్‌గా తీసుకున్నా.

మార్పులో నా పాత్ర ఉండాలి..

సొసైటీలో పాజిటివ్‌గా వస్తున్న మార్పుల్లో నా పాత్ర ఉండాలని కోరుకుంటా. చిన్ననాటి నుంచి నా చుట్టుపక్కల సమాజంలోని లోటుపాట్లను సరిదిద్దడానికి అవకాశం సంపాదించాలని ఆశపడేవాన్ని. ఇటీవల మా ఊరి పక్కనే ఉన్న చిట్టాపూర్ గ్రామానికి చెందిన అనుదీప్ సివిల్స్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించి కలెక్టర్ కావడం, ఆయన చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలిచాయి. సివిల్స్ సాధిస్తే అదే సమాజంలోని ప్రతీకోణంలోనూ ప్రభుత్వ సేవలు విస్తరించవచ్చన్న ఆలోచన మెదిలేది. పోలీసు యంత్రాంగం ప్రస్తుత సమాజంలో ప్రతీఅంశంలోనూ తీసుకుంటున్న భాగస్వామ్యం ఆశించదగ్గ పరిణామం. ప్రజల్లో చట్టాలపై అవగాహన, చైతన్యం మార్పు తీసుకువస్తే పోలీసు వ్యవస్థపై ఇప్పుడు పడుతున్న భారం చాలా మేర తగ్గించవచ్చు.

లక్ష్యం సాధించాడు

మా కొడుకు అనుకున్నది సాధించాడు. మా ప్రోత్సాహం ఎంతఉన్నా శివమారుతిరెడ్డిలో ఉన్నతపన కీలకం. బడిలో చదువు చెప్పేటపుడు ప్రతీ విద్యార్థిలో ప్రత్యేకత ఏదైనా ఓ రంగంలో పట్టు ఉంటుందని గుర్తించా. ఉపాధ్యాయుడిగా నేను నా కొడుకులో ఉన్న తపనను గుర్తించి ప్రోత్సాహించా. ఆశించిన ఫలితం వచ్చింది.

– ఏనుగు అంజిరెడ్డి – పుష్పలత

నక్సలిజంపై ప్రశ్నలు..

సివిల్స్ ఇంటర్వ్యూలో.. నాది తెలంగాణలోని జగిత్యాల జిల్లా కావడంతో ఎక్కువగా నక్సలిజంపై ప్రశ్నలు అడిగారు. జగిత్యాల జైత్రయాత్రపై ప్రశ్నించారు. అంతే కాదు.. మీ ప్రాంతంలో నక్సలిజం ఎందుకు కనుమరుగైందని అడిగారు. సమాజంలో మెరుగైన మార్పుల ఫలితంగా ప్రజల ఆర్థిక స్థితిగతులు బాగుపడటం..అసమానతలు తగ్గడం, సాంకేతికత పెరగడంతో నక్సలిజం తగ్గిపోయిందని చెప్పా. ఒక పోలీసు అధికారిగా అవకాశం వస్తే.. ఎన్‌కౌంటర్లపై మీ అభిప్రాయం ఏంటని ప్రశ్నించారు.

- ఏడోనంబరు రాష్ట్ర రహదారిపై ధర్నా
- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై నిరసన

ఆగ్రహించిన అన్నదాతలు



రోడ్డుపై ధాన్యం పోసి, బైఠాయించిన రైతులు

వెల్గటూర్(ధర్మపురి): అకాల వర్షంతో తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలని, తూకంలో మోసాలను అరికట్టాలనే డిమాండ్‌తో పాశిగామ రైతులు మంగళవారం ఏడోనంబరు రాష్ట్ర రహదారిపై ధాన్యం బస్తాలతో బైఠాయించారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. తహశీల్దార్ వచ్చే వరకు రాస్తారోకో విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రెండు నెలలు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అలాగే ఉన్నాయన్నారు. నిర్వాహకులు కొనుగోళ్లలో అలసత్వం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. వర్షాలకు ధాన్యం తడుస్తున్నా టార్పాలిన్లు ఇవ్వడం లేవని మండిపడ్డారు. తప్ప, తాలు పేరిట ధాన్యంలో కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, తడిచిన ధాన్యాన్ని సైతం త్వరితగతిన కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. రైతుల రాస్తారోకోతో ఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ రమేశ్.. రైతుల సమస్యలను అదనపు కలెక్టర్‌కు ఫోన్ ద్వారా విన్నవించారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా మిల్లర్లతో మాట్లాడతామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తహసీల్దార్ రమేశ్ చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

- రైతులను భయపెడుతున్న అకాలవర్షాలు
- కొన్నిచోట్ల ఇంకా పూర్తికాని కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఇప్పటివరకు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్‌మెంట్
- ఆందోళన వద్దంటున్న మంత్రి కమలాకర్

మళ్లీ తడిసిన ధాన్యం



నాయికపుగూడెంలో తడిసిన ధాన్యం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని ధాన్యం సేకరణలో వేగం పెంచారు. మృగశిర కార్తె తరముకొస్తున్న వేళ.. రైతులు సాగుకు సమాయత్తం కావాలిస్న సమయంలో ఇంకా కొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తికాని వైనం కలవరపెడుతోంది. సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంకా ధాన్యం సేకరణ పూర్తికాని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. చాలాచోట్ల ధాన్యం సేకరణలో జాప్యంపై రైతులు ఆగ్రహించారు.

- జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో ఏకంగా జాతీయ రహదారిపైకి వచ్చి ఆందోళన చేశారు.
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోనూ పలువురు రైతులు రాస్తారోకోకు యత్నించారు.
- తాలు, తేమ, మట్టిబెడ్డల సాకుగా చూపుతూ నేటికీ మిల్లర్లు క్వింటాలుకు కనీసం తొమ్మిది కిలోల మేర ధాన్యం తరుగు తీస్తున్నారన్న విమర్శలు మాత్రం ఆగడం లేదు.

తొలకరి నాటికి లక్ష్యంగా..

ఓవైపు అకాల వర్షాలు రైతులను కలవర పెడుతుంటే.. మరోవైపు.. ప్రభుత్వం ధాన్యం సేకరణను వేగవంతం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ మొదటి వారానికి ధాన్యం సేకరణ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు ధాన్యం కొనుగోలు పూర్తయ్యాక మూతపడ్డాయి కూడా. కరీంనగర్‌లో 341 కేంద్రాలకు 56 కేంద్రాలు, పెద్దపల్లిలో 303 కేంద్రాలకు తొమ్మిది, సిరిసిల్లలో 255కు ఐదు, 416 కేంద్రాల్లో తొమ్మిది కేంద్రాలు మూతబడ్డాయి. మిగిలిన కేంద్రాల్లోనూ వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తిచేయాలని మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలిన 2.23 లక్షల మెట్రిక్‌టన్నులను వారంరోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైతులను ఇబ్బందులుపెడితే చర్యలు



రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించే ఏ రైస్ మిల్లర్‌నూ ఉపేక్షించబోం. ఎవరైనా రైసక్ మిల్లర్ మభ్యపెట్టినట్లు అనిపిస్తే రైతులు మాకు నేరుగా ఫిర్యాదు చేయాలి. బాధ్యులపై మేం వెంటనే తగిన చర్యలు చేపడతాం. అలాగే, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. ధాన్యంలో 17నుంచి 20శాతం వరకు తేమ ఉంటే.. తరుగు, కోత లేకుండా కొనుగోలు చేస్తాం.

– గంగుల కమలాకర్, మంత్రి

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ వివరాలు

జిల్లా పేరు	సేకరించాల్సిన ధాన్యం (లక్ష మెట్రిక్ టన్నుల్లో)	సేకరించిన ధాన్యం (లక్ష మెట్రిక్ టన్నుల్లో)	రైతుల సంఖ్య	కొనుగోలు చేసిన వడ్లవిలువ (రూ.కోట్లలో)
కరీంనగర్	2,32,467	2,41,556	40,490	497.49
జగిత్యాల	4,55,503	3,08,340	42,991	634.91
పెద్దపల్లి	3,04,846	2,37,139	29039	486.40
రాజన్నసిరిసిల్ల	1,88,513	1,71,146	27,826	352.55
మొత్తం	11,81,329	9,58,181	1,40,346	1971.35

అకాల వర్షం.. అన్నదాత ఆగం



తడిసిన ధాన్యం బస్తాలు చూపిస్తున్న రైతు

కథలాపూర్(వేములవాడ): జిల్లా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మళ్లీ తడిసి ముద్దయ్యింది. తూకం వేసిన వడ్ల బస్తాలు తడవడంతో రైతులు వాపోతున్నా రు. వర్షం కురవకుంటే.. మరోమూడు రోజుల్లో తూకం పూర్తయ్యేదని రైతులు తెలిపారు.

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం తడిసింది. వడ్లను ఆరబెట్టడంలో రైతులు నిమగ్నమయ్యా రు. మండలంలో 3.5 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మహేశ్వర్ తెలిపారు.

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు ధాన్యం తడిసింది. లక్ష్మీదేవిపల్లిలో ప్రధాన రహదారిపై 25 రోజుల కింద తూకం వేసిన ధాన్యం మొలకెత్తింది. లారీల కొరతతో ఈ పరిస్థితి తలెత్తింది. లచ్చనాయక్‌తండాలో 2,390 సంచులు, ధర్మనాయక్‌తండాలో 2,400 సంచులు, రంగపేటలో 2,780 సంచులు, భీంరెడ్డిగూడెంలో 4,150 సంచులు, నాయికపుగూడెంలో 2,480 సంచుల్లోని ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు.



ఇబ్రహీంపట్నం మార్కెట్‌లో తడిసిన ధాన్యం

ధర్మపురి: ధర్మపురి, నేరెళ్ల, కమలాపూర్, జైనా, దొంతాపూర్, రాయపట్నం తదితర గ్రామాల్లో ధాన్యం తడిసింది. నిర్దేశిత తేమశాతం వచ్చేందుకు ఇప్పటికే చాలాసార్లు ఆరబెట్టామని, తూకంలో జాప్యమైందని రైతులు తెలిపారు. మంగళవారం వేకువజామున కురిసిన అకాలవర్షంతో మళ్లీ తడిసిందని, ఇక తేమశాతం వచ్చేదెలా? అని ఆవేదన చెందారు.

40 రోజులుగా ఇబ్బందులు



కల్లాల్లో ధాన్యం పోసి 40 రోజులు అవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదు. వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. కొనుగోళ్లలో జాప్యం జరుగుతంది. వారానికో లారీ రావడంతో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంది. వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కొనుగోళ్ల త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలి. ధాన్యం డబ్బులు సైతం సకాలంలో రావడం లేదు.

– క్యాతం రవి, రైతు, జగదేవ్‌పేట, వెల్గటూర్ మం.

లారీలు వస్తలేవు



వరి కోతకోసి సుమారు ముప్పయి రోజులు అవుతుంది. ధాన్యం తూకం వేసి నాలుగు రోజులు అవుతంది. లారీలు వస్తలేవు. మంగళవారం వర్షం కురువడంతో కొన్ని వడ్లబస్తాలు తడిచిపోయినయి. అధికారులు స్పందించి లారీల కొరత తీర్చాలి. ఇప్పటికే వానాకాలం పంట సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఉదయం నుంచి సాయంతరం వరకూ ఇక్కడే ఉంటే పనులెలా చేసుకోవాలి?

– రాచర్ల శంకర్, పెద్దూరు, సిరిసిల్ల

మృగశిర నాటికి కొనుగోళ్లుపూర్తి



తొలకరి సమీపిస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చే శాం. ఉమ్మడి జిల్లాలో 11,81,329 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగో లు లక్ష్యం. ఇప్పటికే 9,58,181 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. మరో మూడు, నాలుగు రోజుల్లో మిగిలిన ధాన్యం కొనుగోలు చేస్తాం. కేంద్రాల్లో అక్కడకక్కడా చిన్న ఇబ్బందులున్నా రైతులకు సమస్యలు రానివ్వం.

– సర్దార్ రవీందర్‌సింగ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్

క్లుప్తంగా

మైనారిటీ గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసేందుకు అన్ని సబ్జెక్టులకు టీజీటీ, పీజీటీ, జేఎల్ స్టాఫ్ కోసం మహిళ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి బాబా ఒక ప్రకటనలో తెలిపారు. విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యం, ఆంగ్ల భాషా పరిజ్ఞానం, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గలవారు జూన్ 9వ తేదీలోపు సంబంధిత పాఠశాలలు, కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 70937 69668 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాహన షోరూం యజమాని బలవన్మరణం

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, మేడిపెల్లి మండల కేంద్రాల్లో హీరో షోరూంలు నిర్వహిస్తున్న యజమాని పబ్బని నరేశ్(38) హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. షోరూం నిర్వహణలో ఆర్థిక నష్టాలు రావడంతో 15రోజులుగా మొబైల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నారు. లాటరీల ద్వారా బైక్‌లు బహుమతిగా అందిస్తామనే విషయంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. నరేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన మృతితో కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో లాటరీ డబ్బులు చెల్లించిన సుమారు 500 మంది ఆందోళనకు గురవుతున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి నరేశ్ నివాసం ఉండేవారు.

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్ శివారులో రోడ్డుపై లారీని నిలిపి, ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గత ఆదివారం రాత్రి కొలనూర్ శివారులో జరిగిన ప్రమాదంలో నిమ్మపల్లికి చెందిన అనుముల ఓజెలు, నాగరాజు మృతి చెందారు. ఓజెలు కుమారుడు రవి ఫిర్యాదు మేరకు డ్రైవర్ గంగుల స్వామి (సిరిసిల్ల)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని టీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సర్పంచు కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్ తదితరులు మంగళవారం పరామర్శించారు.

'ఉపాధి' పని చేస్తూ.. కుప్పకూలాడు

- ధర్మారంలో కూలీ మృతి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో ఉపాధిహామీ పని చేస్తూ ఓ కూలీ అకస్మాత్తుగా మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లెవేణి చంద్రయ్య(55) మంగళవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అల్లంతోట బోరు వద్ద పని చేస్తున్న ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు లేపిచూసేసరికి మృతిచెందాడు. గుండెపోటుతో చనిపోయి ఉంటాడని బావిస్తున్నారు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రయ్యది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచు గున్నాల అరుణ కోరారు.

సైబర్ క్రైం కేసు

జ్యోతినగర్(రామగుండం): క్రెడిట్ కార్డు నుంచి ఖాతాలోకి రూ.20 వేలు మార్చుకోగా అవి ఖాతాలో కనిపించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం కేసు నమోదైంది. వివరాలు.. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన వర్దే శ్రీను జనవరిలో క్రెడిట్ కార్డు నుంచి తన ఖాతాలోకి డబ్బుల జమ చేసుకునే క్రమంలో అవి ఖాతాలో జమకాలేదు. గూగుల్‌లో సెర్చ్ చేసే సమయంలో క్రెడా యాప్‌నకు సంబంధించిన ఓ వ్యక్తి ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకుని డబ్బులు ఖాతాలోకి రావాలంటే పూర్తి వివరాలను సంబంధిత ఫైల్‌లో నమోదు చేసి పంపాలని సూచించాడు. దీంతో శ్రీను కార్డు వివరాలను పంపించడంతో రెండుసార్లు మొత్తం రూ.29,400 తన ఖాతా నుంచి ఇతరుల ఖాతాలోకి వెళ్లడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'బేలర్'.. బేఫికర్

- గ్రామీణ ప్రాంతాలకు గడ్డిని కట్టలు కట్టే యంత్రాలు
- ఈ ఏడాది వర్షాలతో వరి గడ్డికి ఫుల్ డిమాండ్
- డబ్బులు వస్తుండటంతో కాల్చేందుకు వెనుకడుగు వేస్తున్న రైతులు


గడ్డిని కట్టలు కడుతున్న బేలర్ యంత్రం


గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న రైతు

జగిత్యాల అగ్రికల్చర్: రైతులు హార్వెస్టర్లతో వరి పొలాలు కోయిస్తుండటంతో గడ్డి తుక్కుతుక్కుగా మారి, పొలమంతా పడుతోంది. దీంతో వారు పొలాల్లోనే గడ్డిని కాల్చేస్తున్నారు. ఫలితంగా డెయిరీ ఫాం నిర్వాహకులకు, ఒక్కటి రెండు గేదెలు, ఆవులు పెంచేవారికి పశుగ్రాసం కరువవుతోంది. ఈ నేపథ్యంలో అక్కడక్కడ ఉన్న వరి గడ్డిని, బేలర్ యంత్రాల ద్వారా కట్టలు కట్టించి, ఇళ్లకు చేర్చుతున్నారు.

ఎకరం పొలంలో గంట సమయం..

గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కటి, రెండు బేలర్ యంత్రాలు వచ్చాయి. ఇవి ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. వీటి ద్వారా గడ్డిని సేకరించడం సులువు. ట్రాక్టర్ నడుస్తున్న కొద్దీ పొలమంతా పడిన గడ్డిని కట్టలు కడుతూ, చివరకు ఊడి పోకుండా తాడు కూడా కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే 40 నుంచి 50 కట్టలు కడుతుంది. యంత్రం ద్వారా కట్టలు కట్టినందుకు ఒక్కో కట్టకు రూ.40 నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నారు. గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో చాలా మంది రైతులు కాల్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

ఈ ఏడాది గడ్డికి డిమాండ్..

యాసంగి సీజన్ వరి పంట కోయించే సమయంలో వర్షాలు ఏకధాటిన పడటంతో గడ్డి పొలంలోనే మురిగిపోయింది. దీంతో వరి గడ్డికి డిమాండ్ ఏర్పడింది. గతేడాది ఉచితంగా ఇచ్చిన రైతులు ఎకరంలోని గడ్డికి రూ.3 వేల నుంచి రూ.4 వేలు తీసుకుంటున్నారు. మరో 6 నెలల వరకు గడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో ఆవులు, గేదెల ఫాంలున్న రైతులు గడ్డిని కొనుగోలు చేసి, యంత్రంతో కట్టలు కట్టించి, షెడ్లలో నిల్వ చేసుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం బోర్నపల్లి, జగిత్యాల మండలం తాటిపల్లిలో గోశాలలున్నాయి. ఒక్కో గోశాలలో 60 నుంచి 100 వరకు పశువులు ఉన్నాయి. వాటికి గడ్డిని దానం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. చివరకు గడ్డి ఇస్తే తాము కట్టలు కట్టించుకొని, తీసుకెళ్తామని రైతులను కోరుతున్నారు.

కట్టలు కట్టించి తీసుకెళ్తున్న



నాకు రెండు గేదెలున్నాయి. మళ్లీ 3 నుంచి 4 నెలల వరకు పశుగ్రాసం దొరకదు. అందుకే హార్వెస్టర్లు కోసిన గడ్డిని కట్టలు కట్టించి, ఇంటికి తీసుకెళ్తున్న. కట్టలు కట్టినందుకు, ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకురావడానికి రూ.3 వేల వరకు ఖర్చు వస్తుంది.

– కొట్టాల మోహన్ రెడ్డి, లక్ష్మీపూర్, జగిత్యాల రూరల్ మండలం

పశుగ్రాసం నిల్వ చేసుకోండి



యాసంగి సీజన్ వరి కోతలు పూర్తయినందున పశుగ్రాసం నిల్వ చేసుకోవాలి. బేలర్ యంత్రాలు రావడంతో గడ్డి కట్టలు కట్టి, ఇంటి వద్ద వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 2, 3 పశువులకు కనీసం 100 గడ్డి కట్టలు ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, జిల్లా పశువైద్యాధికారి

నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణం

- కుమారుడి జన్మదినం సందర్భంగా ఎన్నారై దంపతుల ఔదార్యం


ధర్మపురిలో ఇంటిని ప్రారంభించిన దాతలు

ధర్మపురి: తమ కుమారుడి జన్మదినం కానుకగా ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఓ నిరుపేద కుటుంబానికి ఇంటిని నిర్మించి ఇచ్చారు ఓ ఎన్నారై దంపతులు. వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని కుమ్మరివాడకు చెందిన పోచంపెల్లి జమునకు ఇద్దరు కూతుళ్లు. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త కుటుంబాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో పిల్లల బాధ్యత జమునపై పడింది. ఆమె పలువురి ఇళ్లలో పాచి పనులు చేస్తూ కూతుళ్లను పోషించుకుంటోంది. ఉండటానికి నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో అమెరికాలో ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెంకు చెందిన సుంకర పోసి ప్రవీణ్, చండీప్రియ దంపతులకు ఒక కూతురుండగా ఏడాది క్రితం బాబు జన్మించాడు. కుమారుడు అభయ్‌రామ్ శ్రీసత్య జన్మదినం సందర్భంగా ఒక పేద కుటుంబానికి సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. తమ ఫేస్‌బుక్ మిత్రుడైన ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్‌ను ఫోన్‌లో సంప్రదించారు. దీంతో ఆయన జమున పరిస్థితిని వివరించి, ఇంటి నిర్మాణానికి సాయం చేయాలని సూచించాడు.

రూ.2.20 లక్షలతో ఇల్లు..

రమేశ్ సూచనతో ప్రవీణ్, చండీప్రియ దంపతులు రూ.2.20 లక్షలు పంపించగా ఇటీవలే ఇంటి నిర్మాణం పూర్తయింది. ప్రవీణ్ తండ్రి వీర వెంకట సత్యనారాయణ, కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం నూతన ఇంటిని ప్రారంభించారు. ఐదేళ్ల క్రితం ఈ దంపతులే తమ కూతురు జన్మదినం సందర్భంగా ధర్మపురిలో పేద కుటుంబానికి ఇల్లు నిర్మించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు అయ్యోరి వేణు, జక్కు పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ది కేరళ స్టోరీ సినిమా ఉచిత ప్రదర్శన


సినిమా చూస్తున్న ప్రేక్షకులు

జగిత్యాలటౌన్: ది కేరళ స్టోరీ చిత్రాన్ని మతం కోణంలో కాకుండా ఉగ్రవాద కోణంతో చూడాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో సినిమాను ఉచితంగా ప్రదర్శించగా నాయకులు ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మతోన్మాదులు, తీవ్రవాదులు ఏ విధంగా హిందూ మహిళలు, యువతులను ప్రేమ పేరుతో ట్రాప్ చేసి, ఉగ్రవాద శిబిరాలకు తరలిస్తున్నారో ఈ చిత్రంలో చూపించారని తెలిపారు. యువతులు, తల్లిదండ్రులు ఈ చిత్రాన్ని తప్పక చూడాలని కోరారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, నాయకులు గుర్రం రాము, జిట్టవేణి అరుణ్, ప్రభాకర్, నారాయణరెడ్డి, బిట్టు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ గుడిసెలు వేసుకుంటున్నారు..

- కోరుట్ల జంబి గద్దె, అల్లమయ్యగుట్ట పరిసరాల్లో రెండు రోజుల క్రితం తొలగించిన అధికారులు
- ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలివ్వాలని పేదల డిమాండ్


గుడిసెలు వేయడానికి భూకొలతలు తీస్తున్న పేదలు

కోరుట్ల: భూపోరాటం యథాతథంగా సాగుతోంది. సోమవారం పోలీసులు బలవంతంగా ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెలు ఖాళీ చేయించగా నిరసన తెలిపిన పేదలు మంగళవారం మళ్లీ జంబి గద్దె స్థలానికి వెళ్లి, ఎప్పటిలాగే గుడిసెలు వేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము సర్కారు భూమిలో కొలతలు తీసి, గుడిసెలు వేసుకుంటామని చెబుతున్నారు.

రెండు చోట్ల..

కోరుట్ల పట్టణంలోని జంబి గద్దె వద్ద ఉన్న 926 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో, ఎఖీన్‌పూర్–కోరుట్ల శివారులోని అల్లమయ్యగుట్ట పరిసరాల్లో 444, 445 సర్వే నంబర్లలోని సర్కారు భూమిలో సీపీఐ అధ్వర్యంలో పేదలు భూపోరాటాలు కొనసాగిస్తున్నారు. కోరుట్ల పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వలస వచ్చి, కోరుట్లలో అద్దెకు ఉంటున్న అనేక మంది ఆయా స్థలాల్లోకి వచ్చి, చిన్నచిన్న కర్రలతో చీరలు కట్టి, గుడిసెలు వేసుకుంటున్నారు. ఇప్పటికే చాలాసార్లు ప్రభుత్వ నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నా నిజమైన పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదంటున్నారు. అందుకే తాము ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటున్నామని చెబుతున్నారు.

అధికారుల మల్లగుల్లాలు..

పేదలు ఇళ్ల స్థలాల కోసం రెండు నెలలుగా పోరాటం చేస్తున్నా సమస్య పరిష్కారానికి ఏ మార్గం అనుసరించాలో తెలియక పోలీసు, రెవెన్యూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మండే ఎండలకు, అకాల వర్షాలకు వెరవకుండా చాలా మంది పేదలు రోజువారీ ఆటోలు కిరాయి మాట్లాడుకొని, జంబి గద్దె, అల్లమయ్యగుట్ట ప్రభుత్వ స్థలాలకు వచ్చి, చెట్ల కింద, తాత్కాలిక గుడిసెల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. నిన్న మొన్నటి వరకు సంయమనం పాటించిన పోలీసులు సోమవారం కాస్త కఠినంగా వ్యవహరించి, జేసీబీలతో గుడిసెలు వేసిన స్థలాలను చదును చేయించారు. అయినప్పటికీ బాధితులు ప్రభుత్వ స్థలాలను వదలకుండా తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మళ్లీ గుడిసెలు వేసుకోవడం ప్రారంభించడం చర్చనీయంగా మారింది.

చెట్టును ఢీకొన్న వరి ధాన్యం లారీ

- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్
- గంటపాటు నరకయాతన
- అతివేగమే ప్రమాదానికి కారణం


లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

కథలాపూర్(వేములవాడ): వరి ధాన్యం తరలిస్తున్న ఓ లారీ కోరుట్ల–జగిత్యాల ప్రధాన రహదారిపై మేడిపెల్లి శివారులో చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకేంద్రానికి చెందిన డ్రైవర్ తిప్పని సందీప్ మంగళవారం రాత్రి వరి ధాన్యం బస్తాలను చెన్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు లారీలో తీసుకెళ్తున్నాడు. వాహనాన్ని వేగంగా నడపడంతో మేడిపెల్లి శివారులో మూలమలుపు వద్ద చెట్టు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందుభాగం నుజ్జునుజ్జయ్యి, డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. దాదాపు గంటపాటు నరకయాతన అనుభవించాడు. డీజిల్ ట్యాంక్ పగిలి, డీజిల్ రోడ్డుపై పారడంతో స్థానికులు ఫైరింజిన్‌ను పిలిపించి, నీళ్లు చల్లించారు. కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, సందీప్‌గౌడ్‌లు జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. అతను తీవ్రగాయాలతో స్పృహతప్పి పడిపోవడంతో చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సతీశ్ చేరుకొని, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపెల్లి ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- వీసీలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


వీసీలో జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, అదనపు కలెక్టర్ మకరంద్, అధికారులు

జగిత్యాల: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. మంగళవారం అన్ని జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ మకరంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాలలో మంగళవారం రెడ్డి సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేదిక రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో జూన్ 6న జరిగే రెడ్ల ఆత్మీయ సమ్మేళనం గోడ పత్రికను ఆవిష్కరించారు. రెడ్డి బంధువులంతా హాజరై, విజయవంతం చేయాలని కోరారు. 50 ఏళ్లు దాటిన ప్రతీ రైతుకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, పేద రెడ్లకు విదేశీ విద్యానిధి, రైతులకు రూ.5 లక్షల ఆరోగ్య భద్రత అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడుగు ప్రభాకర్ రెడ్డి, గడ్డం చంద్రమోహన్ రెడ్డి, ఏలేటి నరసింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, బండ రవీందర్ రెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి, అనుమండ్ల అజయ్‌రెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాతో టవర్ ఎక్కిన యువకుడు


రవికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): కుటుంబ సభ్యులతో ఏర్పడిన భూ తగాదాను పరిష్కరించాలని కోరుతూ ఓ గిరిజన యువకుడు సెల్ టవర్ ఎక్కాడు. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన ధరంసోత్ రవినాయక్ సోదరుల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తోంది. ఇరువర్గాల వారు పలుమార్లు పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. రెండు రోజులుగా గొడవలు తారస్థాయికి చేరాయి. దీంతో మనస్తాపానికి గురైన రవినాయక్ ముస్తాబాద్ చేరుకొని, తమ సమస్య పరిష్కరించాలంటూ సెల్ టవర్ ఎక్కాడు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం భూ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో బాధితుడు కిందికి దిగాడు. పోలీసులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. సమస్య పరిష్కరించాలని తాము కోరితే తమ బంధువులు దాడులు చేస్తున్నారని రవి భార్య రేఖ ఆవేదన వ్యక్తం చేసింది.

డబ్బులు, భూమి కోసమే హతమార్చారు

- దాచారంవాసి శంకర్‌ను చంపింది ఆయన భార్యే
- సహకరించిన కుమారుడు
- ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు


హత్య వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం: కష్టసుఖాల్లో కడవరకు తోడు ఉండాల్సిన భార్య.. వృద్ధాప్యంలో నేనున్నానంటూ చేదోడువాదోడుగా ఉండాల్సిన కొడుకు ఇద్దరూ కలిసి డబ్బులు, భూమి కోసం తమ ఇంటి పెద్దను హత్య చేశారు. ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామానికి చెందిన దర్పిపల్లి శంకర్‌ను ఆయన భార్యే హతమార్చిందని, ఇందుకు వారి కుమారుడే సహకరించాడని సీఐ ఉపేందర్ తెలిపారు. సంబంధిత వివరాలను సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన వెల్లడించారు. శంకర్(55) వ్యవసాయం చేసేవాడు. కుటుంబంలో కొన్ని వివాదాల వల్ల ఆయన భార్య చంద్రకళ, వీరి ముగ్గురు సంతానం సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5వ తేదీన చిన్న కూతురు వివాహం కారణంగా కుటుంబీకులందరూ ఒక్కటయ్యారు. పెళ్లి కోసం శంకర్ తన వ్యవసాయ భూమి విక్రయించాడు. రూ.46 లక్షలు రాగా అందులో నుంచి పెళ్లి కోసం రూ.13 లక్షలు ఖర్చు చేశాడు. మిగతా డబ్బుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డబ్బులు, వ్యవసాయ భూమి తమకు దక్కాలంటే శంకర్ అడ్డు తొలగించుకోవాలని ఆయన భార్య చంద్రకళ, కుమారుడు వంశీకృష్ణ భావించారు. శంకర్ హత్యకు కుట్రపన్నారు. పక్కగా ప్లాన్ చేసి, ఆదివారం రాత్రి ఆయన మద్యం మత్తులో ఉండగా కత్తితో పొడిచి, గొంతునులిమి చంపేశారు. శంకర్ మృతి చెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై రాజేశ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని చెల్లెలు గొల్లపల్లి సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రకళ, వంశీకృష్ణలపై కేసు నమోదు చేశారు. హంతకులను మంగళవారం ఉదయం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

అనారోగ్య కారణాలతో వృద్ధుడి ఆత్మహత్య

సారంగాపూర్(జగిత్యాల): మండల కేంద్రానికి చెందిన బొల్లి మల్లయ్య(85) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మల్లయ్య కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆయన భార్య పదేళ్ల క్రితమే చనిపోయింది. అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన మల్లయ్య మంగళవారం ఇంట్లోని కిటికీకి తాడుతో ఉరేసుకున్నాడు. ఆయన మనవరాలు గమనించి, బిగ్గరగా అరవడంతో కుటుంబసభ్యులు వచ్చి, మెడకున్న తాడును తొలగించారు. కానీ అప్పటికే మల్లయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆశయ్య ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


మృతిచెందిన గేదెల వద్ద రైతు

జగిత్యాలరూరల్: మండలంలోని అంతర్గాంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మతలపురం ఆనంద్ అనే రైతు తన రెండు గేదెలను పశువుల కొట్టంలో కట్టేశాడు. సోమవారం రాత్రి భారీగా వీచిన ఈదురు గాలులతో విద్యుత్ తీగలు తెగి, గేదెలపై పడటంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ అయిలయ్య మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఇఫ్కో మీటింగ్‌కు సింగిల్‌విండోల చైర్మన్లు



రాయికల్(జగిత్యాల): ఢిల్లీలో మంగళవారం ఇఫ్కో ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రాయికల్ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, చొప్పదండి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, పొరండ్ల చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డిలు హాజరయ్యారు. రైతులు ఏ విధంగా అధిక పంట దిగుబడులు సాధించాలన్న అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: రాష్ట్ర ఆవిర్భవ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో జూన్ 2న నిర్వహించే వేడుకల ప్రదేశాలను ఎస్పీ మంగళవారం తనిఖీ చేశారు. జూన్ 4న సురక్షా దినోత్సవం సందర్భంగా కొత్త బస్టాండ్ నుంచి పెట్రోలింగ్ కార్స్, బ్లూకోల్ట్స్ వాహనాలతో ర్యాలీ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. మున్సిపల్ పార్క్ వద్ద సభాప్రాంగణం, సుమంగళి గార్డెన్‌లో జరిగే వేడుకల ఏర్పాట్లపై ఆరాతీశారు. జూన్ 12న తెలంగాణ రన్ మినీ స్టేడియం నుంచి పార్క్ వరకు జరిగే ఏర్పాట్లను పర్యవేక్షించారు. జూన్ 2న అమరవీరుల స్మారక స్తూపం పార్క్ ప్రారంభించనున్న దృష్ట్యా భద్రతాపరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఇతర శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. డీఎస్పీ ప్రకాశ్, టౌన్ సీఐ రామచందర్‌రావు, రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఆర్‌ఐలు వామనమూర్తి, నవీన్, ట్రాఫిక్ ఎస్సై రాము పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసినవారు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు చదివిన పాఠశాలే వేదికైంది. 30 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. వారిని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అందరూ కలిసి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు వేంపేట సర్సారెడ్డి, సుతారి కృష్ణమాచారి, కోటగిరి ఆనంద్‌గౌడ్, మానాల శ్రీనివాస్, పెంటపర్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.